

20న స్విమ్స్‌లో రేడియేషన్ చైర్ ఓరేషన్

తిరుపతి సిటి : స్విమ్స్ రేడియేషన్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏడో వార్షిక చైర్‌ఓరేషన్ కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్ పాల్గొంటారు. హర్యానా ఫైరదాబాద్ సర్వోదయ ఆస్పత్రి నుంచి అథితి హాజరవుతారని విభాగాధిపతి అశోక్‌కుమార్ తెలిపారు.







ప్రమాదాలకు కారణమయ్యేలా ఫ్లెక్సీలు పెట్టొద్దని సిపిఎం విజ్ఞప్తి



'ఫ్లెక్సీ'లకు కూడళ్లు 'ఫిక్స్'

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఏదైన ఊరికి ప్రధాన ప్రవేశమార్గంలో ట్రాఫిక్‌కు అనుకూలంగా కూడళ్ళు ఏర్పాటు చేస్తారు. పట్టణ, నగర ప్రాంతాల్లో వాహనాల రాకపోకల కోసం, విశాలమైన రోడ్లుకు తగ్గట్టు, అధిక సంఖ్యలో సర్కిల్స్(కూడళ్ళు) ఏర్పాటు చేస్తారు. ఆయా కూడళ్లలో మహానుభావులు, సంఘ సంస్కర్తలు, కళాకారులులతో పాటు దేవుళ్ల విగ్రహాలు ఏర్పాటు చేసి, కూడళ్ళు చుట్టు పచ్చని మొక్కలు, పూల చెట్లు, రంగు రంగుల పెయింటింగ్స్, ఆకర్షణీయమైన చిత్రాలు, అద్భుతమైన కళాకండాలు ఏర్పాటు చేస్తుంటారు. తిరుపతి వంటి ఆధ్మాకనగరంలోనూ ఇలాంటి ఏర్పాట్లకు కొదవ లేదు. గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నాయకులు, మహత్మ జ్యోతిరావుపూలే, స్వామి వివేకానంద వంటి సంఘ సంస్కర్తల విగ్రహాలు నగరంలో కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. తిరుపతి ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో శ్రీ వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారి నామాలతో తిరుమల బైపాస్ రోడ్డు సైతం సుందరంగా తీర్చిదిద్దారు. కానీ ఏం లాభం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ తమ ప్రచార ఆర్భాటాల కోసం ఈ కూడళ్ళను ఉపయోగించుకుంటుంది. నిత్యం ప్రతి సర్కిల్‌లో విగ్రహాలు, పచ్చదనం కనిపించకుండా బ్యానర్లు, ఫ్లెక్సీలతో కప్పేస్తున్నారు. అధికార పార్టీ అయితే మరో అడుగు ముందుకేసి నడిరోడ్లలో ట్రాఫిక్‌కు అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆఖరికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా కపిలతీర్థం వద్దనున్న నంది సర్కిల్లో విద్యుత్ దీపాల అలంకరణతో దేవుళ్ళ విగ్రహాలు ఏర్పాటు చేస్తే, వాటిని కూడా కప్పేస్తూ రాజకీయ నాయకుల బ్యానర్లు ఏర్పాటు చేయడం శోచనీయం. ప్రకటన కోసం, ప్రచారాల కోసం నిర్దేశిత ప్రాంతంలో, నిర్ణీత కాలానికి తగ్గట్టు కొంత పైకం చెల్లించి, ఫ్లెక్సీలు బ్యానర్లు ఏర్పాటు చేసుకునే సౌలభ్యం ఉన్నా ప్రభుత్వానికి రూపాయి చెల్లిస్తున్న పాపాన పోలేదు. ఈ బ్యానర్లను సైతం సంబంధిత రోడ్డులోని వ్యాపారులపైనే భారం వేసేస్తుండటం బూర్జువా రాజకీయ నాయకులకు అలవాటుగా మారిపోయింది. ఇకనైనా అధికారులు స్పందించి, ప్రధాన కూడళ్లలో రాజకీయ ఫ్లెక్సీలు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

విపరీతంగా బ్యానర్ల కల్చర్

ప్రమాదాలకు కారణమవుతున్నా... పట్టించుకోని 'కార్పొరేషన్' అధికారులు

నగరంలో ఫ్లెక్సీల సంస్కృతి 'పీక్' స్టేజికి వెళ్లిపోయింది.. కూడలి కనిపిస్తే చాలు బ్యానర్లతో నింపేస్తున్నారు. ఈ పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందంటే కూడళ్ల వద్ద అటువైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు కారణమయ్యే స్టేజికి వెళ్లిపోయింది. అయినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఎందుకంటే అవన్నీ 'అధికార' పార్టీకి సంబంధించినవే కాబట్టి.. ఈ కల్చర్ ఏ స్టేజికి వెళ్లిపోయిందంటే చిన్న చిన్న సందుల్లో గొందుల్లో సైతం భారీ కటౌట్లు పుట్టినరోజు, పోయినరోజులు తెలియజేస్తూ నింపేస్తున్నారు. అర్ధరాత్రుల్లో రోడ్లపైనే పెద్దఎత్తున పుట్టినరోజులు జరిపేస్తున్నారు. తిరుపతి రైల్వే కాలనీలో మాతృశ్రీ, సెవన్‌హిల్స్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో దాదాపు వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. చిన్న చిన్న గొందుల్లోనే ఈ స్కూళ్లు ఉన్నాయి. విపరీతంగా కటౌట్లు పెట్టడంతో ప్రమాదాలు సైతం జరిగాయి. సిపిఎం స్పందించి 'దయచేసి కూడళ్లలో కటౌట్లు' పెట్టొద్దు 'పిల్లల ప్రమాదాలకు కారణం కావద్దు' అని చిన్న బ్యానర్ కట్టాల్సి వచ్చింది. ఏడు యూనివర్సిటీలకు నిలయమైన ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున రాజకీయ ఫ్లెక్సీలతో నింపేస్తుండటం గమనార్హం.

రాజకీయ ఫ్లెక్సీలు ఎక్కువయ్యాయి :

కె.వేణుగోపాల్, సిపిఎం

తిరుపతి నడిరోడ్డులో, ప్రధాన కూడళ్లలో, సందుల్లో, గొందుల్లో సైతం రాజకీయ నాయకుల పుట్టినరోజులు, పెళ్లిరోజులు పేర్లతో భారీ స్థాయిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యా సమస్యలు, ఆలయాలు ఉన్న ప్రాంతాలు కూడా వీటికి మినహాయింపు లేదు. పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం బూర్జువా రాజకీయ పార్టీలకు అలవాటైపోయింది. వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం సరైనది కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లెక్సీల వాతావరణాన్ని అరికట్టాలి.



17 నుంచి టెన్త్ పరీక్షలు

164 కేంద్రాల్లో 28,656 మంది

పకడ్బందీగా ఏర్పాట్లు :కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మార్చి 17-31 తేదీల్లో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి' అని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిఆర్‌ఒ నరసింహులు, డిఇఒ కెవిఎన్ కుమార్, ఇంటర్మీడియట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రెగ్యులర్, ప్రైవేటు కలిపి జిల్లాలో 164 కేంద్రాల్లో 28,656 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఓపెన్ స్కూల్స్ పదవ తరగతి చదువుతున్న 1019 మంది విద్యార్థులకు గానూ 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయమని తెలిపారు.

ఓపెన్ స్కూల్స్ పదవ తరగతి పరీక్షలు మార్చి 17 వ తేది నుండి 28 వ తేది వరకు, ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి అని అన్నారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్ట్మెంటల్ అధికారిని నియమించాలని, 6 ఫ్లయింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేయాలనీ సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జెరాక్స్ కేంద్రాలను, నెట్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. 10 రూట్ లను ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాలతోపాటు స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు, తాగు నీరు, పారిశుధ్యం ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ కమీషనర్లకు, డి.పి.ఓ కు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద, స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు లను నిర్వహించి అత్యవసర మందులను సిద్ధంగా ఉంచాలని డిఎంహెచ్ఓ కు సూచించారు. ఈ సమావేశం లో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ గురుస్వామి రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకష్ణ నాయక్, డిప్యూటీ ఈవో బాలాజీ, జిల్లా రవాణా శాఖ అధికారి మురళీ మోహన్, డి పి ఓ సుశీలాదేవి పాల్గొన్నారు.

భూపయ్య గిరిజన కాలనీలో...

దారికి అడ్డంగా గోడ

తొలగిస్తామని తహశీల్దార్ హామీ

ప్రజాశక్తి - నాయుడుపేట

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని భూపయ్య గిరిజన కాలనీలో గిరిజనులకు దారి లేకుండా అడ్డంగా గోడ కట్టారని సిపిఎం, గిరిజన, బీసీ సంఘాల ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ భూపయ్య గిరిజన కాలనీవాసుల పరిస్థితి దారుణంగా ఉందని, కనీస వసతులు లేవని, ఇళ్లల్లో పాచిపని చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. 40 ఏళ్ల నుంచి నడుస్తున్న దారిపై బిజెపికి చెందిన సీనియర్ నాయకులు సిమెంట్ రాళ్లతో అడ్డంగా గోడ కట్టడం దారుణమన్నారు. పిల్లలు స్కూలుకు వెళ్లే దారిని మూసివేసేసారన్నారు. దారికి అడ్డంగా గోడ కడితే ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ దారికి అడ్డంగా గోడ కట్టి గిరిజనుల పట్ల వివక్ష చూపుతున్న బిజెపి సీనియర్ నాయకునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలన్నారు. తహశీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం సమర్పించారు. తహశీల్దార్ స్పందిస్తూ వారం రోజుల్లో గోడను తొలగించి న్యాయం చేస్తామని



హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. లేనిపక్షంలో 'చలో నాయుడుపేట' కార్యక్రమాన్ని చేపట్టి గోడను బద్దలు కొడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివకవి ముకుంద, పుట్టయ్య, భూపయ్య కాలనీ అధ్యక్ష కార్యదర్శులు అంకయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'నిర్మలమ్మ' బడ్జెట్ మోసపూరితం


ప్రజాశక్తి - తిరుపతి సిటి, గూడూరు

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రధానంగా కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉందని, పేదరిక నిర్మూలన లక్ష్యంగా లేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి విమర్శించారు. వామపక్షాల ఆధ్వర్యంలో తిరుపతిలో వాకింగ్ సెంటర్లలో కరపత్రాలను పంపిణీ చేశారు. బడ్జెట్‌లో ప్రధాన రంగాలైన విద్య, వైద్యంతో పాటు, వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం చేశారన్నారు. యువత సంక్షేమానికి నిధులు కేటాయించలేదన్నారు. పెద్దసంఖ్యలో రోడ్ల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి, టోల్‌ప్లాజా పేరుతో ప్రజల నుంచి పెద్దమొత్తంలో ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న ఉచితాలపై సుప్రీంకోర్టు జడ్జిలు మాట్లాడటం భావ్యం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 22 శాతం దామాషా ప్రకారం నిధులను కేటాయించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం



పెంచలయ్య, జై.విశ్వనాథ్, టి.సుబ్రమణ్యం, వేణు, బుజ్జి పాల్గొన్నారు.

– గూడూరులో బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ కాకులను కొట్టి గద్దలకు పెట్టే చందంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. మూడేళ్లలో బడా కార్పొరేట్ కంపెనీలకు 12 లక్షల కోట్లు ఎగనామంపెట్టారన్నారు. నాయకులు టి.వెంకట రామిరెడ్డి, బివి రమణయ్య, శశికుమార్, కాలేషా, చంద్రయ్య పాల్గొన్నారు.



పేదలందరికీ పక్కా గృహాలు : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - దొరవారిసత్రం

పేదలందరికీ పక్కా గృహాలు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సూళ్లూరుపేట ఎంఎల్‌ఎ డాక్టర్ నెలవల విజయశ్రీ వెల్లడించారు. మంగళవారం నియోజకవర్గ స్థాయిలో గృహనిర్మాణశాఖ సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అర్హులను గుర్తించి, పార్టీలకు అతీతంగా పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రతి పేదవానికి పటిష్టమైన గృహ సముదాయాన్ని ఏర్పాటు చేయడమే ఎన్డీఎ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఏడువేలు దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరం నుంచి నాలుగు లక్షల రూపాయలు కాలనీ ఇళ్లకు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం, తహశీల్దార్ శైలకుమారి, ఎంపిడిఒ గోవర్ధన్, హౌసింగ్ డిఇ దసయ్య, పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల అధికారులు పాల్గొన్నారు.

జెసిఎం బాబుకు సత్కారం

తిరుపతి టౌన్ : తెలుగు కళారత్నాలు సాంస్కతిక సేవా సంస్థ, ఆంధ్రప్రదేశ్ వారిచే జాతీయ బంగారు నంది పురస్కారాన్ని అందుకున్న జెసియం. బాబును రవీంద్రభారతి హైస్కూల్ (కొర్లగుంట) కరస్పాండెంట్ బి.రవీంద్రనాథరెడ్డి , ఉపాధ్యాయ బందం ఘనంగా సత్కరించారు. బి. రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ జెసి యం. బాబు తమ పాఠశాలలో 30 సంవత్సరాలుగా ఆంగ్లోపాధ్యాయులుగా పని చేస్తూ, విద్యార్థులకు సరళమైన పద్ధతులలో ఆంగ్లం నేర్పుతూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుతూ, విద్యార్థులను అన్నిరంగాలలో చక్కగా తయారు చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు భరణి లతారెడ్డి పాల్గొన్నారు.



త్వరలో టిటిడిలో 100 శాతం డిజిటలైజేషన్

రెండో రోజు టెంపుల్ కన్వెన్షన్ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మేనేజ్మెంట్ సర్వీసెస్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం వినియోగిస్తుందని, రానున్న రెండు మూడు సంవత్సరాలలో టీటీడీలో 100 శాతం డిజిటలైజేషన్ చేస్తామని టిటిడి అదనపు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకయ్య చౌదరి అన్నారు. ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్ పో కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు పలువురు ప్రముఖులు తమ సందేశాలను అందించారు. టిటిడిలో పారిశుధ్య నిర్వహణ, క్రౌడ్ మేనేజ్మెంట్, నీటి వినియోగం, దర్శనాల క్యూ మేనేజ్మెంట్, ట్రాన్స్పోర్టేషన్ వంటి అంశాలను వెంకయ్య చౌదరి వివరించారు. తమిళనాడు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ తమిళనాడులో ఎన్డీఏ అధికారంలోకి వస్తే తాము (హెచ్ ఆర్ అండ్ సీఈ) హిందూ రిలీజియస్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్ చట్టాన్ని తొలగించి 44,121 దేవాలయాలకు విముక్తి కల్పిస్తామన్నారు. దేవాలయ ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తోన్న సంపదను దేవాలయాల చుట్టూ ఉన్న పాఠశాలలను నడపడానికి, ఒక నిర్దిష్ట నగరంలో పౌర మౌలిక సదుపాయాలను కల్పించడానికి, ఇంజనీరింగ్ కళాశాలలను నడపడానికి, సైన్స్ కోసం ఎక్సలెన్స్ సెంటర్లను నిర్వహించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. చోళ రాజులు అమలు చేసిన ఖచ్చితమైన, సంక్లిష్టమైన ఆర్థిక ప్రణాళికను గురించి ప్రస్తావించారు. విశ్వ హిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే మాట్లాడుతూ హిందూ సమాజం తమ దేవాలయాలను జాగ్రత్తగా చూసుకోగలదన్నారు. దేవాలయాలను ఒక వ్యవస్థ నుండి తీసుకొని మరొక వ్యవస్థలో ఉంచడం తమ ఆలోచన కాదన్నారు. అన్ని దేవాలయాల స్వయంప్రతిపత్తిని గౌరవించడంతో మహిళలు, ఎస్టీ, ఎస్సీల విస్తత ప్రాతినిధ్యం సష్టించబడుతుందన్నారు. పలువురు నిపుణులతో అంత్యోదయ ప్రతిష్టం సంస్థ వ్యవస్థాపకులు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి ముఖాముఖి చర్చలు నిర్వహించి సమాజాభివద్ధిలో దేవాలయాల పాత్ర, దేవాలయాల ఆదాయాలతో చేసే సామాజిక కార్యక్రమాలు, ఆర్థిక అభివద్ధి వంటి అంశాలను చర్చించారు. ఐటీసీఎక్స్ 3వ రోజు ఆలయ నిర్మాణ సంరక్షణ, ఆలయ నిర్వహణలో స్థిరమైన పద్ధతులు, సమాజ అభివద్ధిలో దేవాలయాల పాత్రపై ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివద్ధి మంత్రి నారా లోకేష్ చివరి రోజున ఇతర ప్రముఖులతో కలిసి పాల్గొంటారని ఐటీసీఎక్స్ ప్రతినిధులు తెలిపారు. ముగింపున ఆలయ ఆధునీకరణ, సంరక్షణ కోసం ప్రధాన కార్యక్రమాల ప్రకటనలు చేయనున్నామన్నారు. రెండవ రోజు కార్యక్రమంలో కోవిలూర్ మఠం 14వ పీఠాధిపతి నారాయణ దేశిక స్వామిగళ్, ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్లు అరుణ్ తంగిరాల, డాక్టర్ కాళిదాస్ ఏటూరు, ఐఎఎస్ రిటైర్డ్ అధికారి మీనాక్షి సుందరం, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ షిర్డీ మాజీ చైర్మన్ డాక్టర్ సురేష్ హవారే తదితరులు పాల్గొన్నారు.




కామన్ పీజీ సెట్ రద్దు చేయాలి

కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల వినతి

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిర్వహిస్తున్న ఉమ్మడి ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేయాలని విద్యార్థిసంఘాల నాయకులు సంయుక్తంగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు పీజీసెట్ల నిర్వహణ గురించి ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. 2021కి ముందు పీజీ సెట్ నిర్వహణ ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ నిర్వహించేదని, నూతన జాతీయ విధానంలో భాగంగా కామన్ పీజీ ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిర్వహిస్తుందన్నారు. ఇలా ఉమ్మడి పీజీ ప్రవేశాల వల్ల 2021 నుంచి 2024 వరకూ 30-40శాతం అడ్మిషన్లు పడిపోయాయన్నారు. 2024లో ఎన్నికల హామీల్లో



భాగంగా నారా లోకేష్ ఉమ్మడి పీజీ అడ్మిషన్లను రద్దు చేసి, ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ ప్రవేశాలు పెట్టేలా చర్యలు తీసుకుంటామని అప్పట్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, బీసీ విద్యార్థి సంఘ నాయకులు తిరుమలేష్, నాల్స వ్యవస్థాపకులు సుందర్ రాజ్, ఐశ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు రంజిత్ , చిన్న ,ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని వీసీకి వినతి

శ్రీ పద్మావతి మహిళ యూనివర్సిటీలో నెలకొన్న హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మహిళా యూనివర్సిటీ నాయకురాలు సునీత, నగర అధ్యక్ష, కార్యదర్శులు బాల, తేజ యూనివర్సిటీ వీసీ ఆచార్య వి. ఉమాకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. వర్సిటీ వసతి గహాల్లో విద్యార్థుల సమస్యలను వివరించారు. విద్యార్థినులకు సరిపడినంత భోజనం నాణ్యతగా అందడం లేదని వివరించారు. పట్టించుకోని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మహిళా వర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఉమ

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సర్గా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వి.ఉమను రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు వి.ఉమ బాధ్యతలు స్వీకరించనున్నారు. 1983లో విశ్వవిద్యాలయం స్థాపించినపుడు లెక్చరర్‌గా జాయిన్ అయ్యారు. ఆమె టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుంచి ఎంఎస్‌డబ్ల్యు పూర్తి చేసి విదేశాల్లో పిహెచ్‌డి పూర్తి చేశారు. నాలుగు దశాబ్దాలపాటు బోధన, పరిశోధనరంగంలో అనుభవం కలిగి ఉన్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పబ్లికేషన్లు, పుస్తకాలు ప్రచురించారు. తనకు వీసీ బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఎడ్యుకేషన్ మంత్రి లోకేష్‌కు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మహిళా వర్సిటీకి నారా లోకేష్ రాక

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం మహిళా యూనివర్సిటీ, సాప్ నిధులతో సంయుక్తంగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నట్లు మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమ మీడియాకు తెలిపారు. ఈ మల్టీపర్పస్ ఇండోర్ హాల్ విలువ సుమారుగా 4 కోట్ల 50 లక్షలు రూపాయలు. ఈ ఆవరణంలో నాలుగు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు, ఒక బాస్కెట్‌బాల్ కోర్టు, ఒక వాలీబాల్ కోర్టు, ఒక నెట్ బాల్ కోర్టు, ఒక హ్యాండ్ బాల్ కోర్టు, జిమ్నాస్టిక్ హాల్, టేబుల్ టెన్నిస్ హాల్, జూడో మ్యాట్, వెయిట్ లిఫ్టింగ్ కోసం ఏర్పాటు చేశారు. ఈ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు మరింత ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని, చదువుతోపాటు క్రీడలలోనూ విద్యార్థినులు ముందంజలో ఉండడానికి తోడ్పడుతుందని మీడియాకు తెలిపారు.

వర్సిటీలో ఏర్పాట్లు పరిశీలన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం తిరుపతి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను జిల్లా ఎస్పి వి హర్షవర్ధన్ రాజు మంగళవారం పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లు పై అధికారులతో చర్చించి, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మహిళా విశ్వవిద్యాలయంలో మంత్రి లోకేష్ శ్రీ పద్మావతి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభిస్తారు. అనంతరం ఇందిర ప్రియదర్శిని ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి కె.రవి మనోహర్ ఆచారి, డిఎస్‌పి లత, సిఐ రామయ్య, వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజనీ పాల్గొన్నారు.

ఎస్వీయూ విసి నియామకంపై సర్వత్రా ఆసక్తి

రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలకు ఆరు మాసాల క్రితం మూకుమ్మడిగా ఉప కులపతులు రాజీనామా చేయడంతో ఆ స్థానాలకు ఖాళీ ఏర్పడింది. వీటన్నింటిలో తాత్కాలిక ఇంచార్జ్ ఉపకులపతులుగా ఆయా వర్సిటీల సీనియర్ ఆచార్యులను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 10 ఉన్నతమైన విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల ఛాన్సర్ అబ్దుల్ నజీర్ ఉపకులపతుల నియామక పత్రాలను విడుదల చేశారు. ఇందులో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా యూనివర్సిటీకి చెందిన సోషల్ వర్క్ విభాగపు సీనియర్ ఆచార్యులు, ఇన్చార్జి విసిగా పని చేస్తున్న ఆచార్య ఉమను నియమించారు. అయితే రాష్ట్రంలోని ఎంతో ప్రతిష్టాత్మకమైన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతి గా ఎవరు వస్తారని ఆత్రుత వర్సిటీ వర్గాలలో నెలకొంది. ఒకవైపు వర్సిటీకి చెందిన ఆచార్యులు వస్తారని, మరొకవైపు ఐఐటి వంటి విశ్వ విద్యాలయాలకు చెందిన బోధనా పరిశోధన అనుభవం కలిగిన సీనియర్ ఆచార్యులు వస్తారని చర్చ నడుస్తోంది.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తలపా దామోదర్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి వేదికగా ఈ నెల 20వ తేదీన జరగనున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అందుకు తగ్గట్లుగా కార్యకర్తలు మరింత గట్టిగా ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ బోస్ రాయల్, ఆంటోనీ, నవీన్, సమీర్, వెంకటేష్, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం మండలాలకు సంబంధించిన పలువురికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 35 లక్షల 48వేల 696 రూపాయల చెక్కులను మంగళవారం బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడ్డ వారు తమను ఆదుకోవాలని పలువురు విన్నవించుకోగా, వారి సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లానని తెలిపారు. సానుకూలంగా స్పందించిన సీఎం చెక్కులు మంజూరు చేసినట్లు వివరించారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి



భోజనం తనిఖీ చేస్తున్న విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని లక్ష్మీపురం పాఠశాల, బుచ్చిరాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఆయన తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో మెను ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మార్చి 8 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం సూచించారు. మంగళవారం కోర్టు ప్రాగణంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసుల శాశ్వత పరిష్కారానికి రాజీయే మంచి మార్గమన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వి.సులోచన రాణి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శంకరయ్య, సీనియర్ ఏ.పి.పి లక్ష్మి నారాయణ, భాస్కర్ రావు, డిఎస్పీ గీతా కుమారి, లాయర్లు కోటేశ్వర రావు, మహబూబ్ బాషా, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బీసీ కాపుకార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు కొరకు రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులకు 19 వ తేదీన బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు జురుగుతాయి. బుచ్చినాయుడు కండ్రిగ, మండల ప్రజా పరిషత్ కార్యాలయం మీటింగ్‌హాలులో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని మంగళవారం ఎంపీడీవో త్రివిక్రమ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

సంఘమిత్ర సమావేశం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ రూపు టాప్ నిర్మించుకోవాలని తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో త్రివిక్రమరావు కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపిఎం మునయ్య అధ్యక్షతన సంఘమిత్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో త్రివిక్రమ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో ప్రభుత్వం సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్పు నిర్మించుకోవచ్చునన్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవడానికి ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించాలన్నారు. ఉపాధి ఏపీవో భానుప్రియ మాట్లాడుతూ ఇంట్లో వ్యర్థ జలాలను రోడ్లపైకి వదిలేయకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు.

ముగిసిన అంగన్వాడీ కార్యకర్తల సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులుగా జరుగుతున్న అంగన్వాడి కార్యకర్తల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్యలు ఈ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్ యమున జ్యోతి, డిఆర్పీలు పవిత్ర, రమేష్, శివశంకర్‌లు హాజరయ్యారు.

'నక్ష' సర్వేతో పారదర్శక భూరికార్డులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'నక్ష' (నక్షా నేషనల్ జియో ఫేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్) సర్వేతో పారదర్శక భూరికార్డులు తయారయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో 'నక్ష' సర్వేపై వర్క్‌షాపు నిర్వహించారు. ఎంపి గురుమూర్తి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్ అనిత పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని 150 సిటీలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి, వీటిలో నక్ష అనే ప్రోగ్రాం కింద సర్వే చేపడుతోందన్నారు. తిరుపతిలో సర్వే పక్కాగా ఉండాలన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతి జిల్లాలో పలు భూసంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. రీ సర్వేలో చేపట్టిన విధంగానే డ్రోన్ ఫ్లై, ఓ ఆర్ ఐ ఇమేజెస్ తీయడం, గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ తదితర ప్రక్రియలు ఉంటాయని తెలిపారు. సర్వే నిర్వహణ చేస్తున్న విషయం సంబంధిత భూమి, ఆస్తి యజమానికి తెలియజేసి ఎలాంటి అపోహలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అనంతరం నక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపాలిటీ అదనపు కమిషనర్ చరణ్ తేజ్, ఉప కమిషనర్ అమరయ్య, సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ సర్వేయర్ దేబ బ్రత పాలిత్, జిల్లా భూ రికార్డుల అధికారి అరుణ్ కుమార్, డిసిపి మాహా పాత్ర, తహశీల్దార్ అర్బన్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



'ఆధార్' తప్పులు లేకుండా చూడాలి

ఆధార్ నమోదులోనూ, అప్డేషన్‌లోనూ తప్పులు లేకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని అప్లోడ్ చేసే ఆపరేటర్లపై జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఆధార్ నమోదుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకూ 61,998 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఐదేళ్ల నుంచి 15ఏళ్లలోపు 77,358 మంది ఉన్నారన్నారు. 16-18 మధ్య 1,03,622 మంది ఉన్నారన్నారు. 17 సంవత్సరాలకు పైబడి మాండేటరీ బయోమెట్రిక్ పెండింగ్ 1,80,980 ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ నరసింహులు, డిపిఓ సుశీల దేవి, డిస్టిక్ కోఆర్డినేటర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు తొలగించండి : కమిషనర్

నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. మంగళవారం 22వ వార్డులోని ఎల్ఎస్‌నగర్‌లో హెల్త్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంఆర్‌పల్లిలోని అన్నాక్యాంటీన్‌ను పరిశీలించారు. చాముండేశ్వరి ఆలయ సమీపంలో ఫ్లైఓవర్ వద్ద చెత్తకుప్పలు ఉండడంతో వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసికుమార్, డిఇ మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, కాసరం గ్రామానికి చెందిన యువత పెద్ద ఎత్తున మంగళవారం జనసేన పార్టీలో చేరారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కోటా వినుత వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనసేన లక్ష్యాలు, పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి తామంతా స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు.

జగన్ ఒక మానసిక రోగి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అధికారంలో ఉన్నపుడు అరాచకాలు చేసి, అధికారాన్ని కోల్పోయాక మానసిక వైకల్యం ఉన్న రోగిలా జగన్ వ్యవహరిస్తున్నాడని టీడీపీ బీసీ విభాగం నాయకులు మంగళవారం జరిగిన సమావేశంలో విమర్శించారు. వల్లభనేని వంశీ విషయంలో నిజాలను దాచి, జగన్ వ్యవహరిస్తున్న తీరు ఇందుకు నిదర్శనమన్నారు. సత్యవర్ధన్ కిడ్నాప్, టీడీపీ కార్యాలయం దాడి విషయాల్లో సీసీ ఫుటేజీలు వంశీనే దోషి అని చెప్తుండగా, జగన్ పోలీసులను చొక్కాలు విప్పి నిలబెడతానని వ్యాఖ్యలు చేయడం ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో మిన్నల్ రవి, డాక్టర్ ఉమేష్ రావు, బుజ్జి, కోటా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు నమోదు వేగవంతం చేయండి



రైతు సేవా కేంద్రంలో గుర్తింపు కార్డుకు నమోదు చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: జిల్లాలో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని సొరకాయల పాళ్యం రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందితేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి మాట్లాడుతూ మండలంలో 5 వేల మంది వ్యవసాయ భూములు కలిగిన రైతులు ఉన్నారని, అందులో పిఎం కిసాన్ లబ్ధిదారులు 3400 మంది ఉన్నారని తెలిపారు. 5 వేల మంది రైతులకు గాను 2352 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకో వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సచివాలయ అసిస్టెంట్లు కార్తీక్, ఢిల్లీ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:

మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా గుర్తింపు కార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారిణి భారతి సూచించారు. మంగళవారం మండలంలోని రైతు గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీ.ఆర్.ఓ లు భాస్కర్, జగదీష్, బాలమురళీకృష్ణ, ఏఈఓ రేవతి, వీఎఎ లావణ్య, భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యర్రావారిపాలెం:

మండలంలోని ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ భాషా పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలంలో 1900 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఫిబ్రవరి 25వ తేదీ లోపల అర్హత గల మిగిలిన రైతులు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఏ మునిశేఖర్, విహెచ్ఎ, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం వ్యక్తి అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, కడప జిల్లా, ఉద్దిమడుగు అడవిలోకి చొరబడుతున్న కొందరు వ్యక్తులను అడ్డుకొని, ఒక వ్యక్తిని అరెస్టు చేశామని రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం విలేకరులకు తెలిపారు. వారి వద్దనుండి 27 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజర్వు ఇన్స్పెక్టర్ చిరంజీవి, ఆర్ఎస్ఐ మురళీధర్ బృందం కడప జిల్లా ఉద్దిమడుగు అటవీ ప్రాంతంలో స్థానిక అటవీ శాఖ అధికారులు పి.ఇందిర, జి.కిషోర్ కుమార్‌లతో కలసి కూంబింగ్ చేపట్టినట్లు చెప్పారు. వీరు తనిఖీ చేస్తుండగా భాకరాపేట ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో జామాయిల్ ప్లాంటేషన్ వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం మొద్దులను మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వెంబడించిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఒకరిని అరెస్టు చేసి 27 ఎర్రచందనం దుంగలు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ లో ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారని తెలిపారు.

జీవో ఎంఎస్ 36 ప్రకారం డ్రైవర్లకు జీతాలు ఇవ్వండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న డ్రైవర్లు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకులు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌ను మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ జీవో ఎంఎస్ 36 ప్రకారం మున్సిపల్ చెత్త వాహనాల డ్రైవర్లకు 24,500 ఇవ్వాల్సి ఉండగా, వెంకటగిరి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల్లాగా 21 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారన్నారు. రాష్ట్రమంతా జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు ఇస్తుంటే వెంకటగిరిలో మాత్రం జీవో ఇంప్లిమెంటేషన్ చేయలేదన్నారు. వెంటనే జీవో 36 ను ఇప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు వెంకటగిరి పట్టణ నాయకులు ఎస్ ప్రసాద్, పి రమణయ్య,పి సుబ్రహ్మణ్యం, వి పెంచలయ్య,తదితరులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శివ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎన్నికల్లో సీఎం చంద్రబాబునాయుడు డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు చేస్తామని, వాహన మిత్ర 15 వేల రూపాయలు ఇస్తామని ఇంకా ఎన్నో వివిధ హామీలను ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయకపోగా, పోలీస్, ఆర్టీవో దాడులు విపరీతంగా పెరిగిపోయాయని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేసి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని, లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

రైల్వే కార్మికుల దీక్షకు ఎంపి సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న ఎంపీ గురుమూర్తి

రేణిగుంట : సిఆర్ఎస్ ఎదుట మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు ఒక రోజు నిరాహారదీక్ష చేపట్టారు. తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన హక్కుల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బాబు, చైర్మన్ సదాశివరెడ్డి కార్మికుల సమస్యలపై మెమరాండంను ఎంపీ, ఎమ్మెల్సీకి అందజేశారు. తిరుపతి జనాభా ఐదు లక్షల కంటే ఎక్కువగా ఉందని, ఇంటి అద్దె ఎక్కువగా ఉన్న దృష్ట్యా తిరుపతి పట్టణాన్ని జడ్ కేటగిరీ నుంచి వై కేటగిరికే మారిస్తే ఉద్యోగులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

'మహాద్వారం' గేటు తెరవలేదని..

టిటిడి ఉద్యోగిపై బోర్డు మెంబర్ బండబూతులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : శ్రీవారిని దర్శించుకుని మంగళవారం ఉదయం తన మిత్రులతో బయటకు వస్తున్న బోర్డు మెంబర్ నరేష్‌కుమార్ టిటిడి ఉద్యోగిపై సీరియస్ అయ్యారు. 'నేను బోర్డు మెంబర్‌ని వస్తున్నానని మీకు తెలియదా' అంటూ విరుచుకుపడ్డారు. ఉద్యోగి సమాధానం చెప్పేలోపే 'ఎవర్రా ఇక్కడ డ్యూటీ వేసింది, బయటకు తరిమేయండి.. ఏ నా కొడుకులురా..' అంటూ బండబూతులు తిట్టాడు. అయితే మీడియా మిత్రులు కవర్ చేస్తుండగా 'తీసింది చాలయ్యా' అంటూ మీడియాపైనా విరుచుకుపడుతూ వెళ్లిపోవడం గమనార్హం. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి 'మీరు బోర్డు మెంబర్ అని అతనికి తెలియదు' అని చెప్పడం గమనార్హం. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బోర్డు మెంబర్ అయి ఉండి ఈ విధమైన బండబూతులతో శ్రీవారి సన్నిధిలో మాట్లాడటం విమర్శలకు తావిచ్చింది.

ఎస్వీఎంసి హౌస్ సర్జన్లకు అవగాహన కార్యక్రమం



సమావేశంలో కోర్సు పూర్తిచేసుకున్న వైద్యులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో మంగళవారం వైద్య వృత్తి చేపట్టబోవు వైద్యులకు, నీతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో విలువలతో కూడినదన్నారు. రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ నీతి, నిబంధనలతో కూడిన వైద్యాన్ని అందిస్తూ, ఆరోగ్యంగా జీవించడానికి సహకరించాలన్నారు. అనంతరం 2019 హౌస్ సర్జన్ బ్యాచ్ చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు, నిరంతర వైద్య విద్య కార్యక్రమ ఇన్చార్జి మధు, ఎస్వీ వైద్య కళాశాల పిఆర్‌ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్



గిన్నిస్ రికార్డును చూపుతున్న నిర్వహకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దేశంలోని 6 వేదికలలో 517 మంది అభ్యర్థులు పాల్గొనగా "అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం (బహుళ వేదికలు)" కోసం ఎస్ ఎం జి ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించిందని ఇండియా క్రెడిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ శంతను మిత్రా మంగళవారు విలేకరులకు తెలిపారు. కంపెనీ 7వ ఎడిషన్ పశు వికాస్ డే లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన అతిపెద్ద ఒకరోజు పశువుల సంరక్షణ శిబిరాలు ద్వారా ఈ మైలురాయిని సాధించామన్నారు. ఈ శిబిరాలు 16 రాష్ట్రాలలోని 500 ప్రదేశాలలో ఏకకాలంలో నిర్వహించబడ్డాయన్నారు. దీనిద్వారా దాదాపు 1,90,000 మంది లబ్ధిదారులు (1,50,000 పశువులు మరియు 40,000 పశువుల యజమానులు) ప్రయోజనం పొందారని తెలిపారు. విజయ సాధనకు కృషిచేసి సిబ్బందిని అభినందించారు. ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ స్వామినాథన్ సుబ్రమణియన్ మాట్లాడుతూ గతంలో పశు వికాస్ దినోత్సవాన్ని వరల్డ్ రికార్డ్స్ యూనియన్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, బెస్ట్ ఆఫ్ ఇండియా రికార్డ్స్, వరల్డ్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించాయని తెలిపారు.

21 న డిఆర్‌డబ్ల్యు కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్, సీడ్‌ఆఫ్, డి ఆర్ డి ఎ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21 న గూడూరు, డిఆర్ డబ్ల్యు కలశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యభివృద్ధి జిల్లా అధికారి లోక నాథం, కలశాల ప్రిన్సిపాల్ హనుమంత రావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన గ్రీన్ టెక్ , వీల్స్ ఇండియా , బ్లూ స్టార్ , క్లయిమాటేక్, ఇంటెల్ సర్వీస్, ముత్తూట్ ఫైనాన్స్, మొదలగు కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 8639835953 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి డిఎస్పి ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలో బహిరంగ ప్రదేశాలలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదని డీఎస్పీ ప్రసాద్, తహసిల్దార్ శివరాం సుబ్బయ్యలతో కలిసి సీఐ సుబ్బరామిరెడ్డి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

క్రైం న్యూస్

శ్రీవారి మెట్ల వద్ద గుండెపోటుతో భక్తుడు మృతి



మృతిచెందిన వెంకటేష్

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): తిరుమల శ్రీవారి దర్శనానికి శ్రీవారి మెట్లు మార్గాన నడిచి వెళుతుండగా మంగళవారం తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఫాదర్ గూడ, ఇందిరా నగర్‌కు చెందిన వెంకటేష్(50) గుండె పోటుతో మృతి చెందాడు. సోమవారం ఇంటి నుండి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వెళ్లేందుకు బయలుదేరి, మంగళవారం శ్రీవారి మెట్ల వద్దకు చేరుకొని టోకెన్ తీసుకుని నడిచి వెళుతుండగా 200 మెట్టు వద్ద గుండెపోటు రావడంతో కింద పడిపోయాడు. వెంటనే బంధువులు శ్రీవారి మెట్టు కిందకి తీసుకువచ్చి 108 అంబులెన్సులో, చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకొచ్చారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినటు ధృవీకరించారు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని బంధువులు తెలిపారు. చంద్రగిరి పోలీసులు సమాచారం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వెంకటేష్ కుటుంబ సభ్యులు కేసు నమోదు చేయొద్దని వెంకటేష్ భౌతికాయాన్ని తమ ఊరికి తీసుకెళ్తామని చెప్పినట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు.

బైకులు ఢీ.. ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



ప్రజాశక్తి - చిట్టమూరు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం చిట్టమూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. కలుగుర్తి పాడు, చిల్లమూరు క్రాస్ రోడ్డు వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలు మేరకు కల్లూరు గ్రామానికి చెందిన ఎస్‌కె మస్తాన్ మొలకలపూడిలోని అత్తగారి ఇంటి నుండి కల్లూరుకి వెళుతుండగా చిల్లమూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, రాజయ్య ద్విచక్ర వాహనంపై ఎదురెదురుగా వస్తూ ఒకరినొకరు ఢీకొనడంతో ఎస్కే మస్తాన్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజయ్య, సుబ్రహ్మణ్యంలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న చిట్టమూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మస్తాన్ మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి వ్యాపారుల జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతిలో మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించే వీధి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివ కుమార్, ఏఐటియుసి నాయకులు మహేష్‌లు కోరారు. పుత్తూరుపట్టణం, రాజరాజేశ్వరి టెంపుల్ వద్ద మంగళవారం మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు.

నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణం

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేటలో నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణం చేపట్టనున్నామని అందుకు స్థల సేకరణ చేస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ఎస్.కె పజిల్లుల్లా మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత తహసిల్దార్ కార్యాలయం దాదాపుగా అర ఎకరా వరకు ఉందని, ఆ స్థలానికి సంబంధించిన వివరాలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళమని ఆయన కూడా అందుకు అంగీకరించినట్లు తెలిపారు.

మెస్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - క్యాంపస్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలు హాస్టల్ మెస్‌లో నాణ్యమైన భోజనం అందించడంలేదని ఎస్వీయు విసి అప్పారావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భగా జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్, ఎస్వీ యూనివర్సిటీ కార్యదర్శి చంద్రనాయక్‌లు మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్, వర్కర్స్ నిర్లక్ష్యంతో నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. రెండు నెలల ముందు నిరసన తెలుపగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారుగానీ నేటికి భోజనం నాణ్యత లేదని నిరసన వ్యక్తం చేశారు.భోజన నాణ్యత పెంచకుంటే విద్యార్థులతో ఉద్యమిస్తామన్నారు.

శివరాత్రి మహోత్సవాలకు సీఎంకు ఆహ్వానం



చంద్రబాబును ఆహ్వానిస్తున్న ఎమ్మెలే, బొజ్జల, గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడు

ప్రజాశక్తి-ఏర్పేడు : తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడులు ఎయిర్‌పోర్టులో కలిసి గుడిమల్లం శివాలయ మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

శ్రీసిటీ అకార్డ్ స్కూల్‌లో జాతీయ భద్రతా మాసోత్సవం



ఆవు మెడలో రేడియం స్టిక్కర్ కడుతున్న శ్రీసిటి అకార్డ్ విద్యార్థులు

ప్రజాశక్తి - సత్యవేడు: జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, రోడ్లపై సంచరించే పశువులను రక్షించడానికి శ్రీసిటీలోని అకార్డ్ స్కూల్ వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పశువులకు రేడియం రిఫ్లెక్టివ్ కాలర్ బెల్ట్‌లను కట్టారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి, అకార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందా పాల్గొన్నారు.

కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మాయాబజార్ సమీపంలో ఉన్న సిపిఎం కార్యాలయంలో కసుకుర్తి కోటేశ్వరరావు, భారతి దంపతుల దాతృత్వంతో వారి కుమార్తె డాక్టర్ కసుకుర్తి



కూరగాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భార్గవి జన్మదినం పునస్కరించుకొని కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు కూరగాయల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో అత్తి మంజరి గోపాల్, పర్వతాల రమేష్, పేయ్యల రమణయ్యలు పాల్గొన్నారు.


యేసుపాకు పెంచలయ్యకు ఘన సన్మానం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతి జిల్లా, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఫర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు యేసుపాకు పెంచలయ్యను గాంధీనగర్ యువత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సిందే వెంకటేష్, దాసు, వెంకీ, వినోద్, మోసే, చిన్ని, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ తనను ఈ పదవికి సిఫార్సు చేసిన ఎమెమల్యే పాశిం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియ చేశారు.

వైభవంగా ధ్వజారోహణం

శ్రీ కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : జేఈవో వీరబ్రహ్మం

ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న జేఈవో వి.వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ, ఫిబ్రవరి 18 నుండి 26వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 22న గరుడసేవ, 23న స్వర్ణరథోత్సవం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం జరుగనున్నట్లు తెలిపారు.

మొదటిరోజు (మంగళవారం) రాత్రి 7 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవ విగ్రహాలను నాలుగు మాడ వీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకాధికారి మరియు సిపిఆర్వో డా.టి.రవి, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధన శేఖర్, ఆలయ అర్చకులు బాలాజి రంగాచార్యులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలను మార్చొద్దు



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - కోట : కోట మండలం, కోట పంచాయతీ, నార్త్ గిరిజన కాలని, ఎలిమెంటరీ స్కూల్‌లో చదువుతున్న పిల్లలను మరొక ప్రాంతంలోకి మార్చవద్దని గిరిజిని కాలనీ ప్రజలు మంగళవారం కోట ఎంపీడీవో ఏకొల్లు వేణుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నార్త్ గిరిజన కాలనీవాసులు మాట్లాడుతూ తమ పిల్లలు నార్త్ గిరిజన కాలనీలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్‌లోనే చదువుకుంటారని తెలుపుతూ తమ పిల్లలు మూడు, నాలుగు, ఐదు తరగతులు చదవడానికి మరొక పాఠశాలకు వెళ్లి చదువుకోలేరని తెలిపారు. ప్రస్తుతం ఉన్న గిరిజన కాలనీలోనే ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీడీవో ఏకొల్లు వేణుని కోరారు. అనంతరం స్థానిక ఎంపీడీవో ఏకొల్లు వేణు ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. నార్త్ గిరిజన కాలనీవాసులతోపాటు ఎంపీటీసీ దారా సురేష్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

జిల్లా వైద్య అధికారి సుధారాణి



భోజన నాణ్యతను తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి సుధారాణి

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా వైద్యాధికారి సుధారాణి అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో, సంక్షేమ వసతి గృహాల్లో మండల ప్రత్యేక అధికారి హోదాలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖలపై పర్యవేక్షించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి శాఖను దశలవారుగా తనిఖీలు చేపడతానని, పాఠశాలలో నాణ్యమైన భోజనం అందివ్వడం లేదని, అంగన్వాడి కేంద్రంలో సరైన వసతులు లేవని, బిసి బాలికల సంక్షేమ వసతి గృహం బాలికలకు సరిపోయే వసతులు లేవని, వసతి గృహ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికలకు పాఠశాలకు వెళ్లి వచ్చేటప్పుడు రక్షణ కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్ రాయలు, వైద్య సిబ్బంది శరత్, పునీత్, హరికృష్ణ, ఆముద, పలువురు ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు ఆధునిక

విద్యను బోధించండి



సూచనలిస్తున్న విద్యాశాఖాధికారి తిరుమల రాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పిల్లలకు ఆట, పాటలతో కూడిన ప్రాథమిక విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు సూచించారు. పుత్తూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 120 రోజుల జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా 6 రోజుల శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బి.తిరుమల రాజు, బాల సుబ్రమణ్యం, డైట్ లెక్చరర్ అనితలు మంగళవారం అంగన్వాడీలకు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, గృహ సందర్శనకి వెళ్ళినప్పుడు సమగ్ర అభివృద్ధిని ప్రేరేపించేలా నేర్చుకోవలసిన విషయాలు గురించి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, కే ఆర్ పిలు అనిత, డి ఆర్ పి లు రమేష్ వెంకటేష్, భూపతి, గీతాంజలి, సంధ్య,అనిత, అంగన్వాడీ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

దినసరి

మార్కెట్ వేలం



వేలం నిర్వహిస్తున్న కమిషనర్ మంజునాథ డౌడ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణములోని స్థానిక పురపాలకసంఘానికి ఆదాయవనరులైన దినసరి మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతువధశాలలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంభందించి గుత్త వసూలు చేసుకోను హక్కుకు, పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ గౌడ్ మంగళవారం బహిరంగవేలం నిర్వహించారు. 1. దినసరి మార్కెట్ ఆర్.మాధవ నాయుడు రూ.20,21,000/-లకు 2. ప్రైవేటు బస్టాండ్ బి. ధనంజయ నాయుడు రూ.15,75,000/-లకు 3. జంతువధశాల శ్రీ జి. గోపీనాథ్ రూ.5,30,000/- లకు పాడుకున్నారు. ఈ పాటతో, గత సంవత్సరము కన్నా రూ.1.99 లక్షలు అదనము ఆదాయము పుత్తూరు పురపాలక సంఘమునకు చేకూరిందని మంజునాథ గౌడ్ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, మాళవ్యనగర్, అర్బన్ హెల్త్ సెంటర్‌లో జిల్లా మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్ , పట్టణ పరిధిలోని వైద్య సిబ్బందితో ఆరోగ్య సమస్యల పరిష్కార ప్రణాళికలపై చర్చించారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో హాస్పిటల్ సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియచేశారు. ఈ సమావేశంలో అర్బన్ హెల్త్ సెంటర్ నూతన ఛైర్మెన్ ఎం.డి. అబ్దుల్ రహీం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్స్, వైద్య సిబ్బంది, పట్టణ పరిధిలోని ఎ.ఎన్.ఎం.లు, శానిటరీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్

శిక్షణా తరగతులు ప్రారంభం



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): గ్రామీణ ప్రాంతాల మహిళలు చేతివృత్తులలో, వృత్తి నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఏపీ ఎస్ఎస్‌డిసి జిల్లా అధికారి లోకనాథం సూచించారు. మండలంలోని నారావారిపల్లిలో స్వర్ణ నారావారిపల్లి పైలట్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం సంకల్ప పథకం, ఏపీ ఎస్ఎస్డిసి, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జనశిక్షణ సంస్థానం ప్రాజెక్ట్ ద్వారా రెండవ బ్యాచ్ టైలరింగ్ శిక్షణా తరగతులను సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రేణుక, ఏపీ ఎస్-ఎస్‌డిసి అధికారి లోకనాథంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రేణుక, డిఆర్డిఏ ఏపిఎం గంగయ్య, జనశిక్షణ సంస్థానం, ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌లు మహిళల ఆర్థిక అభివృద్ధికి ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమాన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ సిబ్బంది, ఏపీ ఎస్ఎస్డిసి సిబ్బంది, సునేషు, జె ఎస్ ఎస్ సిబ్బంది, హరి ,సుధాకర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి మాజీ మంత్రి రోజా విరాళం



విరాళం అందిస్తున్న మాజీ మంత్రి రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం పరిధిలోని 2వ వార్డు తిమ్మాపురంలో శ్రీకృష్ణ మందిరం మంగళవారం జరిగిన మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజా ఆలయానికి లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ డి జయ ప్రకాష్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, డాక్టర్ ఎస్ కృష్ణమరాజు, శ్రీనివాసులు, గాంధీ రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ మనోహర్ రెడ్డి, తిమ్మాపురం నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సురుటుపల్లెలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం మండలం సురుటుపల్లి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణఅధికారి లత, అర్చకులు కార్తికేసన్ ఆధ్వర్యంలో తొలిరోజు గ్రామ దేవత పొన్నెమ్మకు పూజలు జరిపారు. ఫిబ్రవరి 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఫిబ్రవరి 19వ తేదీ ధ్వజారోహణం, పల్లకి వాహనంపై స్వామి వారి ఊరేగింపు, 20 తేదీన చంద్రప్రభవాహనం, 21న కామదేను వాహనం, 22వ తేదీన భూతవాహనం, 23న అధికారనంది వాహనం, 24న గజవాహనం, 25న అశ్వవాహనం, 26న వృషభ వాహనం, 27న కల్పవృక్ష వాహనం, 28న త్రిశూల స్థానం, రావణబ్రహ్మ వాహనంపై శ్రీమరగదాంబిక వాల్మీకేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు మాడవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తూ కనువిందు చేయనున్నాయి.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి -కోట : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కోట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రూప అన్నారు. స్వచ్ఛంద్రా కార్యక్రమంలో భాగంగా మంగళవారం డాక్టర్ రూప ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి ఆవరణంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూప మాట్లాడుతూ తడి,పొడి,చెత్త విషయంలో ప్రతి ఒక్కరు కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోట ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రూప,డాక్టర్ దోమ్ ప్రియా రావు,డాక్టర్ రమేష్ చంద్ర,వి. పృథ్వీరాజ్,డాక్టర్ శ్వేత,డాక్టర్ ఆర్షద్, ఆసుపత్రి సిబ్బంది,శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు పల్లి కొత్తపాలెంకు

నేడు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ రాక

తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్



ప్రజాశక్తి -కోట : కోట మండలం నెల్లూరు పల్లె కొత్తపాలెం చెరువులో చేప పిల్లలు వదిలే కార్యక్రమానికి బుధవారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హాజరవుతారని తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు జలీల్ అహ్మద్ తెలిపారు.